సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 24 । ఆగస్టు । 2023



మారణహోమాన్ని ఆపాలి!
మణిపూర్‌లో క్రైస్తవ సంఘాలు.. చర్చిలపై జరుగుతున్న మారణ హోమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపాలని క్రైస్తవ సంఘాల గురువులు కోరారు. -IIలో



మహిమాన్వితుడు.. శ్రీ వెంకయ్యస్వామి
మహిమాన్వితుడు శ్రీవెంకయ్యస్వామి 38వ ఆరాధన ఉత్సవాలు గురువారం జరగనున్నాయి. -IIలో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.3/28.4
జిల్లాలో బుధవారం 28.4 – 37.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 11.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

ఓ మిత్రమా.. రావోయి విక్రమా!

'చందమామ రావే..' అంటూ ప్రేమగా పిలిచాం..
కొండెక్కి రమ్మని గోముగా అడిగాం...
ఇంతకి వస్తావా.. రావా.. అని అడిగి అలిసిపోయాం..
ఎంతకీ రావా.. సరేలే మేమే నీ చెంతకొస్తున్నాం అంటూ..
జాబిల్లిపై 'విక్రమ్' అడుగిడిన వేళ..
ప్రతి భారతీయుడి మదిలో మెదిలిన భావాలివి..

అవరోధాల దశలెన్నో దాటి..
అవనిలోని దేశాలన్నింటికి ఓ దిశను చూపుతూ..
చక్కటి సాయం సంధ్య వేళ..
పట్టు వదలని 'విక్రమా'ర్కుడై
సుకుమార జాబిల్లిపై
అంతే సుతారంగా అడుగు పెట్టింది విక్రమ్.
ఆ విజయ వీక్షణాన..
జయహో నినాదం మిన్నంటింది..
చంద్రుడి దక్షిణ ధ్రువం దాకా ప్రతిధ్వనించింది..
ముచ్చటపడిన జాబిల్లి.. ఓ నేస్తమా.. రావోయి
'విక్రమా' అంటూ ప్రేమగా పలకరించింది..



చంద్రయాన్-3 విజయవంతం సందర్భంగా పులివెందుల పట్టణంలో భారీ జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ



ఇస్రో నాలుగేళ్ల శ్రమ ఫలించిన వేళది..
చంద్రయాన్-3 నలభై ఒక్క రోజుల ప్రయాణం
విజయవంతమైన సమయమది ...
భారతీయుల దశాబ్దాల కల నెరవేరిన క్షణమది..
ఆ క్షణాన్ని.. ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించిన
ప్రతి భారతీయుడి మది పులకించిపోయింది.
చంద్రయాన్ -3 విజయవంతంతో జిల్లాలోనూ
సంబరాలు అంబరాన్నంటాయి.
స్వీట్లు పంచి సంతోషాన్ని పంచుకున్నారు.
త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తూ
విజయగర్వంతో ఉప్పొంగిపోయారు.

వైవీయూ/కడప ఎడ్యుకేషన్: యావత్ భారతదేశం ఉత్కంఠగా.. ఆశగా ఎదురుచూసిన క్షణాలు ఫలించిన వేళ నగరంలో సంబరాలు మిన్నంటాయి. కడప నగరంలోని రాజీవ్‌మార్గ్‌లో కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి చంద్రయాన్-3 లైవ్‌ను ప్రదర్శించారు. విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా చంద్రునిపై అడుగిడడంతో సంబరాలు చేసుకున్నారు. పలువురు కేక్‌లు కట్ చేసి సందడి చేశారు.

● కడప నగరంలోని ఏడురోడ్ల కూడలిలో ఏపీ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో చంద్రయాన్ విజయంపై సంబరాలు నిర్వహించారు. త్రివర్ణ పతాకాలు చేతబూని జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి, కడప అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జిలాని, కార్యదర్శి వివరామకృష్ణ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..
చంద్రయాన్-3ను పాఠశాల విద్యార్థులందరూ వీక్షించాలన్న ఉద్దేశ్యంతో పాఠశాల విద్యాశాఖ సైతం పాఠశాలల సమయాన్ని పొడిగించి లైవ్ ద్వారా ల్యాండింగ్‌ను వీక్షించే అవకాశం కల్పించింది. దీంతో జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందఘడియలను ఆస్వాదించారు. జయహో భారత్ నినాదాలతో హోరెత్తించారు.

హర్షం..
చంద్రయాన్-3 విజయవంతం కావడంపై డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.



కడప నగరంలోని రాజీవ్‌మార్గ్‌లో ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్,



చంద్రయాన్ 3 ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న జనం



ఎర్రగుంట్ల ప్రభుత్వ పాఠశాలలో వీక్షిస్తున్న విద్యార్థులు

విజయం సాధించారు



చంద్రయాన్-2 విఫలమైన సమయంలో ఇస్రో శాస్త్రవేత్తలకు మద్దతుగా యావత్ భారతదేశం నిలబడింది. ఆ ఓటమి నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు పాఠాలు నేర్చుకుని ఆత్మవిశ్వాసంతో సాధించారు. చంద్రయాన్ విజయంలో భాగస్వాములైన శాస్త్రవేత్తలందరికీ శుభాకాంక్షలు. –సుధాకర్, వీసీ, వైవీయూ

జాబిల్లిపై జెండా.. సువర్ణఘట్టం..



ఇస్రో సైంటిస్టులు భవిష్యత్ తరాలకు ఆత్మస్థైర్యం నింపడంలో భాగంగా దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్‌ను ల్యాండ్ చేయడం చిరస్మరణీయ ఘట్టం. శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు.
– మహేశ్వర్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, కడప

కీర్తిని ఇనుమండింపజేశారు



భారత శాస్త్రవేత్తలు దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమండింపజేశారు. చంద్రుడిపై కాలుమోపిన నాలుగోదేశంగా భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు.
– సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

అద్భుతం.. అపురూపం!



భారత అంతరిక్షరంగ చరిత్రలో అద్భుతమైన అపురూపదృశ్యం ఆవిష్కృతమైంది. భారతదేశాన్ని ప్రపంచ అంతరిక్ష పటంపై సమున్నతంగా నిలిపిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు.
–రామచంద్రయ్య, ఎమ్మెల్సీ

ఆంధ్రకేసరి ఆదర్శప్రాయుడు



టంగుటూరు ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయరామరాజు



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీఅన్బురాజన్

కడప సెవెన్‌రోడ్స్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయుడని, ఆయన మార్గం అందరికీ అనుసరణీయమని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రకాశం పంతులు జయంతి సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు జాతీయవాది, రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్త అని తెలిపారు. ప్రకాశం పంతులు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ఆంధ్ర కేసరి'కి నివాళి
కడప అర్బన్: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని బుధవారం ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, ఏ.ఆర్. డీఎస్పీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్-కొట్టాయం మధ్య ప్రత్యేక రైలు



కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సికింద్రాబాద్–కొట్టాయం–సికింద్రాబాద్ (07119/20) మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలు ఈనెల 25వ తేది సాయంత్రం 5.50 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి 26వ తేది రాత్రి 11.20 గంటలకు కొల్లాంకు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు ఈనెల 27వ తేది సాయంత్రం 7 గంటగలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు రాత్రి 11.50 గంటలకు సికింద్రాబాద్ చేరుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎత్తిపోతల ద్వారా భూగర్భజలాలు పెంచడమే లక్ష్యం
- ఎత్తిపోతల ప్రారంభోత్సవంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



స్విచ్ ఆన్‌చేసి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వి. కొత్తపల్లె గ్రామ సమీపంలో పులివెందుల బ్రాంచి కెనాల్ కింద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాన్ని బుధవారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, మండల ఇంచార్జ్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల బ్రాంచి కెనాల్ కింద ఉన్న చెరువులను ఎత్తిపోతల ద్వారా నీటితో నింపుతున్నామన్నారు. చెరువులను నీటితో నింపడం ద్వారా వ్యవ సాయ బావులు, బోర్లలో భూగర్భజలాలు పెరుగుతాన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలన్న ఉద్దేశ్యంతో రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వేముల మండలంలోని వి.కొత్తపల్లె, వేంపల్లె మండలంలోని ముసల్‌రెడ్డిగారి పల్లె, టి.వెలమవారిపల్లె, గిడ్డంగివారిపల్లె, తాళ్లపల్లె, చింతలమడుగు, కుప్పాలపల్లె చెరువులను నీటితో నింపడం జరిగిందన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వి.కొత్తపల్లె పీబీసీ వద్ద ఎత్తిపోతల పథకం మోటార్ల కెపాసిటీ పెంచి నీటిని తరలిస్తున్నారన్నారు. చెరువులను నీటితో నింపడం ద్వారా వర్షాభావం నెలకొన్న వ్యవసాయ బావుల్లో సాగునీటి కొరతలేకుండా చూస్తున్నామన్నారు. ఎంపీపీ చల్లా గంగాదేవి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, పీసీబీ సభ్యులు మరకాశివకృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ మల్లికార్జునరెడ్డి, పీబీసీ ఈఈ రాజశేఖర్, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి
కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి ఆవిష్కరణలపైపు అడుగులు వేసేలా సైన్సు ఉపాధ్యాయులు కృషి చేయాలని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్‌స్పైర్ మనాక్‌కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం వేముల మండలం కొత్తపల్లెగ్రామంలో జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డితో కలిసి ఎంపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమంలో ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొనేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో దిగ్విజయంగా ముందుకు తీసుకపోతున్న డీఈఓ రాఘవరెడ్డి, జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డిలను ఆయన అభినందించారు.

బిందువు.. సేద్యానికి సింధువు

- రాయితీపై రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలు
- 2023-24 ఏడాదికి 10,500 హెక్టార్లు లక్ష్యంగా అడుగులు
- వైఎస్సార్ జిల్లాలో 14,476 మంది రైతుల దరఖాస్తు
- జిల్లాలో 33 శాతం మేర లక్ష్యం పూర్తి

కడప అగ్రికల్చర్: జిల్లాలో బిందు, తుంపర సేద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటల సాగుకు కావాల్సిన పరికరాలు, ఎరువులు, విత్తనాలు రైతులకు అందించడం తదితర సంస్కరణలతో అన్నదాతలకు ఆత్మబంధువుగా సీఎం నిలుస్తున్నారు. తాజాగా పెట్టుబడి, సాగునీటి కష్టాలను గట్టెక్కేందుకు బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తూ రాయితీపై పరికరాలు అందించనున్నారు.

14,476 మంది రైతుల దరఖాస్తు
రైతులకు రాయితీపై సూక్ష్మ సేద్య పరికరాలు సమకూరుస్తూ సాగును ప్రోత్సహిస్తున్నారు. వారికి నచ్చిన కంపెనీ పరికరాలను ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తూ ఆర్బీకేలలో చేపట్టిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రస్తుతం జిల్లాలో మమ్మురంగా సాగుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి 14,476 మంది రైతులు 18111 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం చేసేందుకు అంగీకరిస్తూ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.



పెండ్లిమర్రిలో మిరప పంటకు ఏర్పాటు చేసిన బిందు సేద్య పరికరాలు చూపుతున్న రైతన్న

2023-24 ఏడాది సూక్ష్మ సేద్య సాగు లక్ష్యం: **10,550** హెక్టార్లు
డ్రిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు: **14,476**
ప్రాథమిక విచారణ పూర్తయిన రైతుల సంఖ్య : **5996**
సూక్ష్మ, సేద్య పరికరాలు మంజూరైన వారు: **2873**
బిందు, తుంపర సేద్య సామగ్రి అందుకున్న రైతులు: **1529**

● 2023-24 సంవత్సరానికి జిల్లాలోని 36 మండలాల పరిధిలో 10,500 హెకార్లను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. అవసరం ఉన్న రైతులు అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లను కలిసి వివరాలను నమోదు చేయించాలి. ఇప్పటి వరకు 5996 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 7147 హెక్టార్లలో అధికారులు పొలం, నీటి సౌకర్యం తదితర అంశాలపై విచారణ పూర్తి చేసి 2873 మందికి పరికరాలు మంజూరు చేశారు. జిల్లాలో 33 శాతం మేర లక్ష్యాన్ని చేరుకున్నారు.

రాయితీ వివరాలివీ
సూక్ష్మ సేద్య పథకం కింద మామిడి, సపోటా, చీనీ, జామ, అరటి, బొప్పాయి, కూరగాయలు, పూల మొక్కలు, పసుపు, ఉల్లి, శనగ, వేరుశనగ పంటలు సాగు చేసే అన్నదాతలను ప్రోత్సహించేందుకు బిందు, తుంపర సేద్య పరికరాలు ఇవ్వనున్నారు. గతంలో రాయితీపై పరికరాలు తీసుకున్న రైతులు ఏడేళ్లు పూర్తి చేసి ఉంటే మళ్లీ అందిస్తారు.

● బిందు సేద్య పరికరాలను 90 శాతం రాయితీపై రైతులకు ఇవ్వనున్నారు. 5 నుంచి పదెకరాల లోపు భూమి కలిగిన వారికి 75 శాతం ఇవ్వనున్నారు.

● తుంపర సేద్య పరికరాలకు 55 శాతం రాయితీ ఇవ్వనున్నారు. 5 నుంచి 10 ఎకరాల లోపు భూమి కలిగిన వారికి 45 శాతం రాయితీ ఇవ్వనున్నారు.

జిల్లాలో నియోజక వర్గాల వారీగా సూక్ష్మ సేద్యానికి ఎంపిక చేసిన భూమి వివరాలు..

నియోజకవర్గం	ఎంపిక చేసిన భూమి (హెక్టార్లలో)
పులివెందుల	5715
జమ్మలమడుగు	1995
కమలాపురం	1125
బద్వేల్	620
మైదుకూరు	625
పొద్దుటూరు	195
కడప	10
రాజంపేట	215

రైతులకు అవగాహన కల్పించాలి
కడప అగ్రికల్చర్: గ్రామీణ ప్రాంతాల్లోన సూక్ష్మ నీటి సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. కడపలోని ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలో అధికారులు, వివిధ కంపెనీ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి 10,500 హెక్టార్లను లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ప్రస్తుతం ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందని, సూక్ష్మ నీటిసాగు పరికరాలు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు. ఏపీడీ మురళీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు కేసీ నీరు

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేసే రైతులు సెప్టెంబరు రెండవ వారం వరకు వేచి చూడాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహాసంఘ సమావేశంలో కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా సంఘ అధ్యక్షులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో కేసీ కెనాల్ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కేసీ కెనాల్ నుంచి సాగునీరు అందే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని వర్షాధార పంటలు సాగు చేయాలా? లేక ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలో రైతులే నిర్ణయించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వ్యవసాయ సలహదారు తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. జిల్లా సలహాబోర్డు అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావు, ఇతర అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పని చేయాలి
ఐసీడీఎస్ అధికారులు సేవా దృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆ శాఖ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్న ప్రతి లబ్దిదారు కుటుంబం కూడా అంగన్వాడీ సేవలను పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ఆగస్టు 16 నుండి సెప్టెంబర్ 9 వరకు.. జిల్లాలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను మండల, గ్రామ సచివాలయ స్థాయి వరకు నిర్వహించడం జరుగుతోందన్నారు.ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మీ, సీడీపీవోలు, అంగన్వాడీ సూపవైజర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి
జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలని కలెక్టర్ విజయ్ రామ రాజు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 2023 జూన్ 30వ తేదీ నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.14,924 కోట్లకు గాను.. రూ.6,280.01 కోట్ల రుణాలు మంజూరు చేసి 42.07 శాతం ఆర్థిక ప్రగతిని సాధించామన్నారు. ఇక మొత్తం వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.9,565 కోట్ల లక్ష్యం కాగా రూ.4,056.84 కోట్ల రుణాలు అందజేసి 42.41 శాతం పురోగతి సాధించామని వివరించారు. ఎస్ఎంఈ సెక్టార్‌కు సంబంధించి రూ.2, 045 కోట్ల లక్ష్యం కాగా రూ.1,007.19 కోట్ల రుణాలు అందజేసి 49.25 శాతం ప్రగతి సాధించామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

తెలుగు వారోత్సవాల పోస్టర్ విడుదల
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నేటి నుంచి తెలుగు భాష వికాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు, అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య తెలిపారు. జిల్లా పర్యాటక అధికారి మల్లికార్జునరావుతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆ భూమిపై కోర్టులో వివాదం



మాట్లాడుతున్న సంబటూరు సంటెయ్య

మైదుకూరు : మైదుకూరు మండలం బసవాపురం వద్ద ఉన్న తన భూమిని ఎమ్మెల్యే ఆక్రమించి తనకు అన్యాయం చేస్తున్నారని సంఘన కిషోర్ రెడ్డి చేసిన ఆరోపణల్లో ప్రస్తావించిన భూమి మాదిగ మాన్యమని, దానిపై కోర్టులో వివాదం నడుస్తోందని మండలంలోని జాండ్ల వరం వీఆర్‌ఓ కాలనీకి చెందిన సంబటూరు సంటెయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో జాండ్లవరానికి చెందిన మాదిగలకు సర్వే నంబర్లు 837, 839లో 78.90 ఎకరాల మాదిగ మాన్యం భూములు ఉండేవని సంటెయ్య పేర్కొన్నారు. ఆ భూములు 16 మంది పేర్లతో ఉండేవని తెలిపారు. జాండ్ల వరం నుంచి మాదిగలంతా బయటకు వచ్చే సమయంలో ఆ రెండు సర్వే నంబర్లలో ఉన్న భూములపై 100 కుటుం బాలకు హక్కు కల్పించుకున్నామని చెప్పారు. తర్వాత తమలో మేటీలుగా ఉన్న నలుగురు వ్యక్తులు మిగిలిన వారికి తెలియకుండా భూమిని పంచుకుని అమ్ముకు న్నారని అన్నారు. అయితే మాదిగల ఇళ్ల స్థలాల కోసం ఉం చుకున్న సర్వే నంబర్ 839లోని 5.19 ఎకరాల భూమిని సంబటూరు సుబ్బయ్య మరో ముగ్గురు తమ పేర్లతో అధి కారుల నుంచి ఎన్‌ఓసీ తెచ్చుకొని తొలుత లక్ష్మిరెడ్డి అనే వ్యక్తికి అమ్మారని వివరించారు. అదే వ్యక్తులు తిరిగి కిషోర్ రెడ్డి మరో ముగ్గురికి ఆ భూమిని విక్రయించినట్లు తెలి పారు. ఆ విషయంపై తాను మరో 30 మందితో కలిసి కోర్టును ఆశ్రయించినట్టు పేర్కొన్నారు. కోర్టులో భూమిపై వివాదం నడుస్తుందని చెప్పారు. ప్రస్తుతం ఇంటి స్థలాల కోసమే తాము ఆ భూమిని చదును చేశామని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

పాలకొండలో చిరుతల సంచారం

రామాపురం : గువ్వలచెరువు పరిధిలోని తూర్పు పాలకొం డలో, ఫారెస్టు గెస్ట్ హౌస్ సమీపంలోని లోయలో చిరుత సం చరిస్తున్నట్లు గొర్రెల కాపర్లు చెబుతున్నారు. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో కోనేటి వద్ద చిరుత తన పిల్లలతో తిరుగుతూ గొర్రెల కాపర్లకు కనిపించడంతో గ్రామ ప్రజలకు, వాహన దారులకు విషయం తెలియజేశారు. ఈ విషయంపై బీట్ అధికారి గాయత్రిని వివరణ కోరగా ఫారెస్టు పరిధిలోని పప్పిరెడ్డి కుంట, విప్లమడ ప్రాంతాల పరిధిలోని సీసీ కెమెరా లను ఏర్పాటు చేశామని, అందులో చిరుతలు తిరుగు తున్నట్లు కనిపించిందని ఆమె తెలిపారు.

మహిమాన్వితుడు..శ్రీ వెంకయ్యస్వామి



గొలగమూడిలో కొలువై ఉన్న శ్రీవెంకయ్యస్వామి మూలవిరాట్(ఫైల్)



హత్యరాలలో ఉన్న వెంకయ్యస్వామి ఆలయం

- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో స్వామి వారికి 208 ఆలయాలు
- నేడు ఆరాధనోత్సవాలు

రాజంపేట రూరల్ : భక్తుల కొంగుబంగారం, అవధూత, మహిమాన్వితుడు శ్రీవెంకయ్య స్వామి 38వ ఆరాధన ఉత్సవాలు గురువారం జరగనున్నాయి. ఈనేపథ్యంలో స్వామి వారి ఆలయాలను నిర్వాహకులు సుందరంగా అలం కరించారు. నెల్లూరుజిల్లా గొలగమూడి గ్రామం లో కొలువుదీరిన శ్రీ వెంకయ్యస్వామికి వైఎ స్సార్, అన్నమయ్య జిలాల్లలో దాదాపు 208 ఆలయాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో విశేష సంఖ్యలో శిష్యులు, భక్తులు ఉన్నారు.ఆరాధనోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారు. స్వామికి ప్రియ శిష్యుడైన శ్రీ గురవయ్యస్వామి మహా రాజ్ రచించిన కథనాల మేరకు వివరాలు..

తొలి సంతానంగా జననం ......

నెల్లూరుజిల్లా చేజర్ల మండలం నాగుల వెల్లటూరు గ్రామంలోని సోంపల్లి పెంచలయ్యచౌదరి, పిచ్చమ్మగార్లకు తొలిసంతానంగా 1897లో శ్రీ వెం కయ్యస్వామి జన్మించారు. స్వామికి దాదాపు 20 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు పెంచలకోన నుంచి కణ్వమహర్షి వచ్చి వెంకయ్యస్వామిని ఆశీ ర్వదించారు. అప్పటి నుంచి స్వామి ఇహలోకంలో ఉంటూ 'చాకలి యోగము, మంగళి యోగము, బుడుకు, బుడుకు' అంటూ వీధుల వెంట తిరు గుతూ బిక్షాటన చేసేవారు. అయితే స్వామిని ప్రజలు పిచ్చివారిగా భావించేవారు. ఈనేపథ్యం లో శ్రీ వెంకయ్యస్వామి మేనమామ స్వామి వారికి నాలికపై బంగారుతో కాల్చారు. దీంతో స్వగ్రా మాన్ని విడచి పెంచలకోనకు వెళ్లి పోయారు.

పెంచలకోనలో వెంకయ్యస్వామికి సాక్షాత్తు పెంచలనరసింహస్వామి దర్శనమిచ్చి, శిర స్సుపై తాకి ఆశీర్వదించారు. అక్కడే గుహల్లో ఉన్న గురుదేవులు, మహర్షులు, మునుల వద్ద శిష్యరికం 12 సంవత్సరాలు చేసి తపోయాగం పొంది సర్వశక్తులు కూడగట్టుకున్నారు.

వైభవంగా ఆరాధనోత్సవాలు

1982వ సంవత్సరం ఆగస్టు 24వ తేదీ వెంక య్యస్వామివారు కైంకర్యం పొందారు. అప్పటి నుంచి ఆయన శిష్యులు ఆగస్టు నెలలో గొలగ మూడిలో 18 నుంచి 24వ తేదీ వరకు ఆరాధనో త్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల కోసం స్వామి వారి ఆలయాలను విద్యుద్దీపాలతో, పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులు విధిగా 'ఓంనారాయణ, ఆదినారాయణ'అనే మంత్రాన్ని స్మరిస్తూ పూజలు చేస్తారు. స్వామివారి దారం ధరిస్తే సకల వ్యాధులు నశిం చి, కోరిన కోర్కెలు నెరవేరి ఐశ్వర్యం సిద్ధిస్తుం దని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ధునిలో వేయాల్సినవి..

స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు ధుని చుట్టూ 3, 6 లేక 9 ప్రదక్షణలు చేయాలి. ధునిలో తప్పనిరిగా ఎండుకొబ్బరికాయ,నవ ధాన్యాలు వేసిన అనంతరమే స్వామిని దర్శిం చుకోవాలి.

స్వామి సేవే మహాభాగ్యం



వెంకయ్యస్వామి వారికి సేవ చేయడమే మహాభాగ్యం. ఆయనను నమ్ముకున్న వారికి అంతా శుభమే. కొన్ని సంవత్సరాల క్రితం ఇక్కడ ఆలయం నిర్మించు కున్నాం. అప్పటి నుంచి మా కుటుంబీకులం స్వామి వారికి సేవలు చేస్తూ తరిస్తున్నాం.

– తిక్కారపు.లక్ష్మీదేవి, వెంకయ్యస్వామి భక్తురాలు,మందరం కొత్తపల్లి.

రాజారెడ్డి హత్యపై విష ప్రచారం తగదు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : డాడీ హోం నిర్వాహకుడు రాజారెడ్డి హత్యను తాను ప్రోత్సహించానని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విషప్రచారం చేయడం తగదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బుధవారం మీడియాతో మాట్లాడుతూ డాడీ హోంతోపాటు పూజా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహిస్తున్న రాజారెడ్డి తనకెంతో ప్రీతిపాత్రుడ ని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వీరాభిమానిగా ఉన్నాడన్నారు. ఆయన అకాల మరణం తన మన సుకు బాధకలిగించిందన్నారు. కొద్ది రోజుల కిం దటే రాజారెడ్డి తనకు ఫోన్ చేసి మాట్లాడారని, లోకేష్ పాదయాత్రకు చౌడూరు వద్ద ఉన్న తన పాఠశాలలో ఎవరు అడిగినా ఆశ్రయం ఇవ్వలే దన్నారు. రాజారెడ్డిది సాధారణ మరణంగానే అం దరూ భావించారని, పోలీసుల జోక్యంతోనే హత్య విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. అను మానాస్పద మృతిపై పోలీసులు లోతుగా విచా రణ జరిపి అసలు విషయాలను వెలుగులోకి తెచ్చారన్నారు. రాజారెడ్డి సొంత తమ్ముడితోపాటు ఆయన కుటుంబ సభ్యులు ఆస్తి కోసం ఈ హత్యకు పాల్పడ్డారన్నారు. 82 ఏళ్ల వయసు ఉన్న పెద్దాయన వరదరాజులరెడ్డి ఈ హత్యకు సంబం ధించి తనపై నిందనలు వేయడాన్ని ఆక్షేపించారు. సాధారణ వ్యక్తులు మాట్లాడితే తాను పట్టించుకో నని, ఐదు మార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వరద రాజకీయ స్వార్థం కోసం ఇలా మాట్లాడారని ఆరో పించారు. దీనివల్ల పోలీసుల ఆత్మ స్థైర్యం దెబ్బ తినే అవకాశం ఉందన్నారు. హత్య కేసును ఛేదిం చిన టూటౌన్ సీఐ ఇబ్రహీం, రూరల్ ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్‌లను ఎస్పీతోపాటు డీజీపీ కూడా ప్రత్యేకంగా అభినందించారన్నారు. నిజా యితీగా పనిచేసేవారిని విమర్శించడం సబబు కాదని తెలిపారు. వరదరాజులరెడ్డిలా చెన్నమరా జుపల్లె నడిపెన్నను, రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం బ్రాహ్మణుడైన ఆడిటర్‌ను హత్యలు చేయిం చలేదని ఎమ్మెల్యే తెలిపారు.

- కొత్తపల్లె గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ స్థానానికి టీడీపీతోపాటు బీజేపీ ఇతర పార్టీలు పోటీ చేయలేకపోయారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎద్దేవా చేశారు. తమ రెబల్ అభ్య ర్థి అయిన హర్షవర్ధన్‌రెడ్డి గెలిస్తే టీడీపీ, బీజేపీ నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయ కులు పేరం బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ పేరం సునీత, మాజీ సర్పంచ్ గురుస్వామి, వార్డు మెం బర్ లక్ష్మినారాయణరెడ్డి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ



ఎర్రగుంట్ల : పట్టణంలోని కడప రోడ్డులో మహారాష్ట్రకు చెందిన లారీ ఇనుప సామగ్రి తీసుకెళుతుండగా అతి వేగంగా వచ్చి డివై డర్‌ను ఢీకొంది. దీంతో డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఈ సంఘటన బుధవారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు, మున్సిపల్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.విద్యుత్ స్తంభం రోడ్డుకు అడ్డం గా పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ప్రభుత్వ న్యాయవాదిగా శివశంకర్‌రెడ్డి

కడప అర్బన్ : ప్రభుత్వం తరపున సివిల్ కేసులను వాదించేందుకు కడప న్యాయవాది పి. శివశంకర్‌రెడ్డిని ప్రభుత్వ ప్లీడర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కడప కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తాత్కాలిక ప్రాతిపదికన ఈయన ప్రభుత్వ ప్లీడర్‌గా పనిచేస్తున్నా రు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మూడేళ్ల వరకు ఈ పదవిలో కొనసాగుతారు.

మణిపూర్‌లో మారణ హోమాన్ని ఆపాలి!



ర్యాలీలో ముందుకు సాగుతున్న క్రైస్తవ గురువులు, విశ్వాసులు,ప్రజలు

కడప కల్చరల్ : కొద్ది నెలలుగా మణిపూర్‌లో క్రై స్తవ సంఘాలు.. చర్చిలపై జరుగుతున్న మారణ హోమాన్ని ఇకనైనా ఆపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని కడప నగ రానికి చెందిన క్రైస్తవ సంఘాల గురువులు కోరారు. బుధవారం కడప నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య మాత చర్చి పాస్టర్ ఫాదర్ విల్సన్ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి మానవుడికి జీవించే హక్కు ఉందని, అంబేడ్కర్ రాజ్యాంగంలో జీవించే హక్కుతోపాటు ప్రజలు తమకు ఇష్టం వచ్చిన మతంలోకి వెళ్లేందుకు హక్కులు కల్పించారని, ప్రస్తుతం ఆ హక్కులను కాలరాస్తూ మణిపూ ర్‌లో క్రైస్తవులు, చర్చిలపై మారణ హోమం సాగుతుండడం మానవత్వానికి మాయని మచ్చగా నిలుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలని, శాంతి భద్రతలను పునరుద్ధరిం చాలని, సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. కృపా చర్చి క్రైస్తవ ప్రసంగీకులు బ్రదర్ టీడీ ప్రసన్నకుమార్, మరి కొందరు క్రైస్తవ గురువులు మాట్లాడుతూ మణి పూర్‌లో పరిస్థితి నెలల తరబడి ఇలాగే ఉండడం మానవత్వానికి మచ్చగా మిగులుతుందని, కేం ద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఈ దారుణాలను ఆపాలని కోరారు. క్రైస్తవం మతం కాదని, ఒక శాంతియుత జీవన విధానం అని స్పష్టం చేశారు. స్థానిక జియోన్ వ్యాయామ కళా శాలలో ప్రారంభమైన అఖిల క్రైస్తవ సంఘాల ర్యాలీని క్రైస్తవ గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రారంభించారు. ఆరోగ్య మాత పుణ్యక్షేత్రం, కాంగ్రిగేషనల్ టౌన్ చర్చి, కృపా చర్చి, సెవెంత్ డే అడ్వెంటిస్ట్ చర్చి, కృప పరిచర్యలు మందిరం, ఏపీ పాస్టర్ ఫెడరేషన్, కడప వైఎంసీఏ, కడప క్రైస్తవ సమాఖ్య తదితర సంస్థలు ర్యాలీలో శాంతిని కోరుతూ నినాదాలు చేస్తూ సాగారు.

సర్వే.. సంపూర్ణం

- వైఎస్సార్ జిల్లాలో లెక్కతేలిన ఓటర్లు
- ఇంటింటా తిరిగి వివరాలు సేకరించిన అధికారులు

వైఎస్సార్ జిల్లాలో మొత్తం ఓటర్లు	:15,88,570
అందుబాటులో లేని ఓటర్లు	:24,394
ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి సంఖ్య	:27,381
మరణించిన వారు	:27,088
ఫొటోలు సక్రమంగా లేని వారు	:5702
పునరావృతమైన వారి సంఖ్య	:5622

ఫారం-6, ఫారం-8 దరఖాస్తుల వివరాలు

నియోజకవర్గం	ఫారం-6	ఫారం-8
బద్వేలు	2314	4275
కడప	2228	7817
పులివెందుల	2378	2831
కమలాపురం	2327	1751
జమ్మలమడుగు	3167	2784
ప్రొద్దుటూరు	2378	1199
మైదుకూరు	2705	2651

కడప సెవెన్ రోడ్స్ : కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే కార్యక్రమం జిల్లాలో పూర్తయింది. ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం -2024లో భాగంగా జిల్లా అధికారులు ఈ ప్రక్రియ నిర్వహించారు. వైఎస్సార్ జిల్లాలో 15,88,570 మంది ఓటర్లు ఉండగా బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు, సిబ్బంది ఓటరు జాబితాతో ఇంటింటికీ వెళ్లి వివ రాలను పరిశీలించారు. మరణించిన, ఇతర ప్రాంతాల్లో ఉన్న, వివాహాలు చేసుకుని శాశ్వ తంగా వెళ్లిన వారిని గుర్తించి పేర్లు నమోదు చేసుకున్నారు. వీటితోపాటు ఎన్నికల సంఘం ప్రకటించిన అర్హత తేదీల మేరకు 18 ఏళ్లు నిం డిన 17,497 మంది నుంచి ఫారం-6, చేర్పులు, మార్పులు కోరిన 17,871మంది నుంచి ఫారం-8 సేకరించారు. ఈసీ మార్గద ర్శకాల మేరకు ఓటరు తొలగింపు విషయం లో జాగ్రత్తలు పాటించినట్లు అధికారులు తెలి పారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

– ఐదుగురి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న దుంగలు, నిందితులతో అటవీశాఖ అధికారులు

రైల్వేకోడూరు : కోడూరు రేంజ్ పరిధిలో బుధ వారం అక్రమంగా తరలిస్తున్న ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేసినట్ల కోడూరు రేంజర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. తమకు ముందస్తు సమాచారం రావడంతో కేవీ బావి సెక్షన్ ప్రాంతంలో సిబ్బందితో కలిసి కూం బింగ్ నిర్వహిస్తుండగా కొంత దూరంలో ఎర్రచం దనం దుంగలను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తిం చామన్నారు. వెంటనే అక్కడికి వెళ్లి 7 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.శివయ్య, ఈశ్వ రయ్య, చెంగయ్య, మల్లీశ్వర్, వెంకటయ్యలను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. పరారైన వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎఫ్ఎస్‌వో మహేష్‌కుమార్, ఎఫ్‌బీవోలు ప్రసాద్‌నాయక్, జనార్దన్‌లు పాల్గొన్నారు.

దుకాణదారుడికి నోటీసు



దుకాణాదారునితో మాట్లాడుతున్న దేవదాయశాఖ అధికారి శంకర్‌బాలాజీ

కడప కల్చరల్ : కడప నగరం వైవీ స్ట్రీట్‌లోని దుకా ణదారునికి జిల్లా దేవదాయశాఖ అధికారులు బుధ వారం నోటీసులు ఇచ్చారు వైవీ స్ట్రీట్‌లో యాదాళ్ల పిచ్చయ్యశ్రేష్టి ఛారిటబుల్ ట్రస్టుకు చెందిన దుకా ణాల్లో స్థానిక వ్యాపారి చాలా కాలంగా అద్దె చెల్లిం చడం లేదని ట్రస్టు ప్రతినిధి జ్వాలా చైతన్య దేవదా యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు ట్రిబ్యునల్‌కు వెళ్లింది. పలు సంవత్సరాలుగా ఈ కేసు పెండింగ్‌లో ఉంది. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇలాంటి కేసుల్లో ట్రిబ్యున ల్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా దేవదా యశాఖ అసిస్టెంట్ కమిషనర్లే చర్య తీసుకోవచ్చని అధికారాలు ఇచ్చారు. దీంతో ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధి ఈ అంశాన్ని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ దృష్టికి తెచ్చారు. ఆయన దీన్ని ఎస్పీతోపాటు ఇతర సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం వైవీ స్ట్రీట్‌లోని దుకా ణానికి ఆయన తమ శాఖ కడప నగర ఈఓ ఎ.శ్రీ ధర్, ఇన్‌స్పెక్టర్ జనార్దన్, వన్‌టౌన్ ఎస్ఐ మధు సూదన్, పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి ఆ దుకాణానికి వెళ్లి యజమానికి విషయం గురించి వివరించారు. యజమాని అభ్యర్థన మేరకు వారం రోజుల్లోపు అద్దె చెల్లించాలని లేదా దుకా ణాన్ని సీజ్ చేయగలమని హెచ్చరించారు.

రైతులకు రుణాలు అందించాలి



మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

కడప అగ్రికల్చర్ : రైతులకు కావాల్సిన రుణాలను అందించడంలో సొసైటీలు, డీసీసీ బ్యాంకు ముం దుండాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. బుధవారం కడపలోని డీసీసీ బ్యాంకు హెడ్ ఆఫీస్‌లో పొద్దుటూరు సహకార శిక్షణ సెంటర్ వారి ఆధ్వర్యంలో బ్యాంకు, సొసైటీ సిబ్బందికి మొండి బకాయిలు ఎలా వసూలు చేయాలనే విషయంపై డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్ర కుమార్ ఆధ్యక్షతన ఒక్క రోజు వర్కుషాపు జరిగిం ది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆప్కాబ్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు, వారి పిల్లలకు విద్యా రుణాలు జాప్యం లేకుండా మంజూరు చేయాలన్నారు. రుణాల మం జూరులో అవినీతి జరిగినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు సీఈఓ రాజేంద్రకుమార్, ఓఎస్డీ గురప్ప, బ్యాంకు సలహాదారు సహదేవరెడ్డి, డీసీసీ బ్యాంకు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్

పులివెందుల : లింగాల మండలం కోనమల్లేశ్వర స్వామి ఆలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఈశ్వ రయ్య(65) ఈనెల 4తేదీన హత్యకు గురైన విషయం విదితమే. ఈ కేసును పోలీసులు ఛేదిం చారు. బుధవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ రాజు లింగాల మం డలం ఎస్ఐ రవికుమార్‌లతో కలసి మీడియా ఎదుట నిందితుడిని హాజరుపరిచారు. ఈ సంద ర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆలయంలో వంట మాస్టర్‌గా పనిచేస్తున్న అనంతపురం జిల్లా గార్లది న్నెకు చెందిన రామాంజి డబ్బులకోసం 4వతేదీ రాత్రి వాచ్‌మెన్ ఈశ్వరయ్యను హత్యచేసి పారిపో యాడన్నారు. బుధవారం నామాలగుండు వద్ద నిం దితుడిని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

వాహనానికి నిప్పు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని ఆర్ట్సుకాలేజీ రోడ్డులో ఆకతాయిలు పల్సర్ బైక్‌కు నిప్పు పెట్టారు. పోలీసుల కథనం మేరకు.. కడపకు చెం దిన లక్షుమయ్య మంగళవారం ఆర్ట్సుకాలేజీ రో డ్డులో ఉంటున్న అత్తగారింటికి పల్సర్‌బైక్‌లో వ చ్చాడు. రాత్రి ఇంటి ముందు బైక్‌ను పార్కు చేశాడు. అర్ధరాత్రి సమయంలో ఆకతాయిలు నిప్పంటించ డంతో బైక్ పూర్తిగా కాలిపోయింది. సీఐ రాజారెడ్డి, ఎస్ఐ మంజునాథ్ సంఘటనా స్థలానికి వెళ్లి కాలిన బైక్‌ను పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ మంజునాథ్ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
వైఎస్సార్ జిల్లా
గురువారం ॥ 24-8-2023



ఆచంద్ర తారార్కం ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట... 'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు' చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు. మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా. 'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు. ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు. 'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాథలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు.'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు



● మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మిన్నీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తియదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజనీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్ప బలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళ్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమై ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు ఛైర్ ఉమన్ (ఛైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్లు పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంశాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయిల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది



సౌమ్య ఈ తరం టెకీ. సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.

వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్లేయర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.



● సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

''నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్టులు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హటాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఒవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్లేయర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్ఓ 27001' సర్టిఫికేట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మానాన్న కనిపిస్తున్నారు'' అని వివరించారు సౌమ్య.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అందంగా పెంచుకుందాం!

బ్యూటిప్స్





గోళ్లు ..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..

- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్లు విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్







- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌ల్లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.
- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.

అబద్ధాలను నమ్ముతున్నారా?!

సైబర్ టాక్



నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోలుతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

- డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి.
- వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఏఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు.
- వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి.
- లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.



ఇన్‌పుట్స్: అనీల్ రాచమల్ల, డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్